శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం,ఫిబ్రవరి20ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 1159క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 61.288 టి ఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 650, పెన్నా డెల్టాకు 5000 కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం98.210మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**కోవూరు,ఫిబ్రవరి 20ప్రభాతవార్త :** ఆరుగాలం కష్టించి పనిచేసిన రైతు లకు సరైన గిట్టుబాటు ధర అందం చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కోవూరు ఎమ్మె ల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార పరపతి సంఘంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ కోవూరు నియోజకవర్గంలో మరో 15 రోజుల్లో వరికోతలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులు పండించిన ధాన్యా నికి ప్రభుత్వం చెప్పిన గిట్టుబాటు ధర కల్పించేందుకే కోవూరు నియోజకవర్గ పరిధిలో 40 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు పండించిన ధాన్యానికి మిల్లర్లు కూడా సహకరించి ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర అందించాలన్నారు. ముఖ్యంగా దళారి వ్యవస్థను పూర్తిగా అరికట్టేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు సంక్షేమానికి ఈ కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే ఈ ధాన్యం కొనుగోలు కేంద్రానికి సంబంధించి జాయింట్ కలెక్టర్‌తో కూడా ప్రత్యేకంగా మాట్లాడి డెల్టా ప్రాంతమైన కోవూరు నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. రైతు సమస్యలు పూర్తిగా తెలిసినప వారినే పెన్నా డెల్టా ఆయకట్టు ఛైర్మన్గఆ ఎంపిక చేయడం జరిగిందన్నారు. అటువంటి వారి నేతృత్వంలో రైతులు తమ సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించుకోవాలన్నారు. ముఖ్యంగా తేమ శాతం విషయంలో కొనుగోలు కేంద్రంలోనూ, రైస్ మిల్లులోనూ ఒకే యంత్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోవూరు నియోజకవర్గం డెల్టా ప్రాంతం కాబట్టి ఇక్కడ ఎక్కువ శాతం రైతులు వరిని పండిస్తున్నారని, ఇటువంటి నియోజకవర్గంక ఎమ్మెల్యే కావడం తమ అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కోతల సీజన్ పూర్తయ్యే వరకు రైతులకు ఏ సమస్య వచ్చినా తమ అధికారులు, తాము అందుబాటులో ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెంట్రల్ బ్యాంక్ సీఈవో శ్రీనివాసులు, జిల్లా సహ కార శాఖ అధికారి గురప్ప, పెన్నా డెల్టా ఆయకట్టు ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కాటంరెడ్డి కృష్ణారెడ్డి, కోవూరు నీటి సంఘం అధ్యక్షుడు అత్తిపల్లి శివారెడ్డి, సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి, పర్సన్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, ఎంపీపీ టి. పార్వతి, వేగూరు సర్పంచ్ అమరావతి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, పార్టీ నేతలు బాల రవి, ఎం. సుధాకర్, ఎన్. వెంకట్, శ్యామ్ సుందర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, తహసీల్దార్ నిర్మ లానందబాబా, మండల వ్యవసాయాధికారిణిఇందిరావతి, రైతులు ఉన్నారు.

## వేమిరెడ్డి దంపతులను కలిసిన డిప్యూటి మేయర్ సయ్యద్ తహసీన్



**నెల్లూరురూరల్, ఫిబ్రవరి 20, ప్రభాత వార్త** నెల్లూరు డిప్యూటి మేయర్‌గా ఎన్నిక అయిన సయ్యద్ తహసీన్ మాగుంటలే అవుట్‌లోని విపిఆర్ నివాసంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. వేమిరెడ్డి దంపతులకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆశీస్సులందుకున్నారు. డిప్యూటి మేయర్ రూప్ కుమార్ యాదవ్, డిప్యూటి మేయర్ సయ్యద్ తహసీన్ భర్త ఎస్ ఆర్ ఇంతియాజ్ వేమిరెడ్డి దంపతులను కలిశారు.

## బుచ్చిలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం



**బుచ్చి ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని చెన్నూరురోడ్డును. బస్టాండ్ సెంటర్‌ను రూరల్ డిస్‌పి ఘట్టమనేని శ్రీనివాసరావు, నగర పంచాయితీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు బుచ్చిరెడ్డిపాళెంలో ట్రాఫిక్ నియంత్రణ విషయం పరిశీలిస్తున్నట్లు తెలి పారు. అందులో భాగంగా డిఎస్‌పి ఘట్టమనేని శ్రీనివాసరావు బుచ్చికి టౌన్‌లో ట్రాఫిక్ నియంత్రణ పరిశీలించడం ఆనందంగా ఉందని అన్నారు. డిఎస్‌పితో కలిసి ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేసేందుకు పలు స్దలాలు పరిశీలించారు. ఆటో నడిపే వాళ్ళకు ఐడి కార్డుతోపాటు వాళ్ళ ఆటోకు ప్రత్యేకంగా నెంబర్ ఇవ్వాలని సూచించారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో మద్యలో హైవే వెలుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుందని డిఎస్‌పి తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈవిటీజింగ్‌ని అరికట్టేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆర్టీ బస్సు డ్రైవర్లు కూడా రోడ్డుపైన అడ్డంగా నిలపకుండా పక్కన నిలుపుకోవాలని సూచించారు. చెన్నూరురోడ్డులో కూరగాయాల అంగళ్ళు పెట్టుకునే వారు మార్కెట్ నిర్మాణం పూర్తి అయితే ఎక్కువ శాతం అక్కడికి వెళతారని కొంత అది కూడా ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగపడుతుందని అన్నారు. దాతలు స్పందించి సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. సిసి కెమెరాల వల్ల అనేక కేసులుచేదించడం జరిగిందనిఅన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాసులురెడ్డి, సంతోష్‌రెడ్డి, మోర్ల మురళీ తదితరులున్నారు.

## ప్రజలకు నాణ్యంగా ప్రభుత్వ సేవలు



**నెల్లూరు, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త,** కలెక్టరేట్ రాష్ట్ర ప్రభుత్వ సేవలను ప్రజలందరూ సంతృప్తి చెందేలా పారదర్శకంగా అందించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేకదృష్టి పెట్టాలని ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి కె విజయా నంద్‌అన్నారు. గురువారం ఉదయం సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లా డుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం అనేక చర్య లు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సుమారు 158 రకాల సర్టి ఫికెట్లను వాట్సప్ ద్వారా సులభతరంగా అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. త్వరలో మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమ్మాలెన సామాజిక పింఛన్లు, అన్నా క్యాంటీన్లు, ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్య సేవలు, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు, రేషన్ పంపిణీ, దీపం గ్యాస్ పంపిణీ మొద్కలెన కార్యక్రమాల అమలుపై ఐవిఆర్, క్యూఆర్ కోడ్, వాట్సప్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ సేవల పట్ల ప్రజలందరూ కూడా సంతృప్తిచెందేలా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. అన్ని సేవలను ప్రజలకు సకాలంగా నాణ్యంగా అందించేందుకు కృషిచేయాలని, ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ రిపోర్టును పరిశీలించి తదనుగుణంగా సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలందరూ కూడా తమ అభిప్రాయాలను ఐ వి ఆర్, క్యూఆర్ కోడ్, వాట్సాప్ ద్వారా తెలియజేయాలని పిలుపునిచ్చారు. అలాగే నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఖపబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పి4) ఒక కీలకమైన సాధనమని పేర్కొన్నారు. పి 4 భాగస్వామ్యంతోనే రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధిని సాధించగలదని అన్నారు. పి 4 ప్రాముఖ్యతను ఆయన వివరిస్తూ, ఇది వనరుల సద్వినియోగానికి, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందని, ప్రజల భాగస్వామ్యం, జవాబుదారీతనం పెంచుతుందని తెలిపారు. పేదరిక నిర్మూలన, విద్య, వైద్యం, ఇతర సామాజిక సేవలలో మెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక, వ్యవసాయాభివృద్ధి వంటి లక్ష్యాలను పి 4 ద్వారా సాధించవచ్చున్నారు. తొలుత రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న టెన్త్, ఇంటర్, ఏపిపిఎస్‌సి పరీక్షల ఏర్పాట్లు, భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్లు, ఎస్పీలకు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి సిఎస్ పలు సూచనలు చేశారు. ఇది పరీక్షల సమయమని, అన్ని పరీక్షలను పక్కాగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు. ఎపిపిఎస్‌సి చైర్మన్ అనూరాధ మాట్లాడుతూ గ్రూప్2 పరీక్షలకు తీసుకోవాల్సిన అన్ని ముందస్తు చర్యలను కలెక్టర్లు, ఎస్పీలకు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, డిపివో శ్రీధర్‌రెడ్డి, ఎపిఎంఐపి పిడి శ్రీనివాసులు, జిల్లా ఉద్యానవనశాఖాధికారి సుబ్బారెడ్డి, సిపివో నరసింహారావు, ఎపిపిఎస్‌సి అధికారులు, పరీక్షా కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ సంస్థ బలోపేతానికి కలిసి పనిచేద్దాం

## టీపీసీ సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి దిశానిర్దేశం



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త** ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి రూ.262 కోట్లతో లాభాల బాటలో సం స్థ అధికారులు, టీపీసీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలి నెల్లూరు రూరల్ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ బిఎస్ఎన్ ఎల్‌ను లాభదాయక సంస్థగా మారుస్తామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, టెలికం అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ప్రజలు బీఎస్ఎన్ఎల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. నెల్లూరు నగరంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో గురువారం టెలికం అడ్వైజరీ కమిటి (టీపీసీ) తొలి సమావేశం ఎంపీ వేమిరెడ్డి అధ్యక్షతన, సంస్థ నెల్లూరు ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ అమరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో బిఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. ముందుగా బిఎస్ఎన్ఎల్ కార్యాలయానికి చేరుకున్న ఎంపీ వేమిరెడ్డికి బిఎస్ఎన్ఎల్ ప్రతినిధులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రారంభమైన సమావేశంలో నూతనంగా ఎన్నికైన టెలికం అడ్వైజరీ కమిటీ(టీపీసీ) సభ్యులను పరిచయం చేశారు. బిఎస్ఎన్ఎల్ సాధించిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి జిల్లాలో బిఎస్ఎన్ఎల్ కు సేవలకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. నెట్‌వర్క్ సమస్యలపై ప్రధానంగా చర్చించారు. అనంతరం టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, నెల్లూరు సిటీ, రూరల్, కందుకూరు, కోవూరు నియోజకవర్గాల్లో ఉన్న ఇబ్బందులను సభ ముందుంచారు. దీనికి అమరేంద్ర రెడ్డి స్పందిస్తూ, ప్రతినిధులు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మళ్లీ ఆరు నెలల తర్వాత నిర్వహించుకునే ఈ సమావేశం నాటికి ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని ఎంపీ వేమిరెడ్డి అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ నెల్లూరు జిల్లాలో దాదాపు 2 లక్షల 7 వేల మంది కస్టమర్లకు సర్వీసెస్ అందిస్తోం దన్నారు. 17 సంవత్సరాల తర్వాత 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ - డిసెంబర్ కాలానికి రూ.262 కోట్ల లాభాలు వచ్చాయని, అంతకు ముందు ఏడాది ఇదే సమయంలో రూ.1569 కోట్ల నష్టం వచ్చిందన్నారు. లాభాలు సంస్థ అభివృద్ధికి నిదర్శనమని స్పష్టం చేశారు. టెలికం రంగంలో ప్రైవేట్ సెక్టార్ నుంచి నుంచి తీవ్ర పోటీ ఉన్నా.. బిఎస్ఎన్ఎల్ తన ఉనికిని కాపా డుకుంటోందన్నారు. మారుతున్న కాలానికి తగ్గ ట్లుగా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 301 4జి టవర్లు ఏర్పాటు చేశారని, మరిన్ని టవర్లు ఏర్పాటుకు అధికారులు కృసి చేస్తున్నారు. ఇటీవల గౌరవ ప్రధా నమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు 4జి, 5జి సేవలు అందించేందుకు బిఎస్ఎల్ కృషి చేస్తోందని స్పష్టం చేశారు. టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ఇబ్బందులను సభ దృష్టికి తెచ్చారని, అధికారులు వాటిపై దృష్టి పెట్టి పరిష్కారం చూపుతారన్నారు. వినియోదారులకు 4జి సేవలు అందిస్తూనే, 5జిపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. సంస్థ అభివృద్ధికి టిపిసి సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని, టిపిసి సభ్యులు బిఎస్ఎన్ఎల్ అందించే వివిధ సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నెల్లూరు బిఎస్ఎన్ఎల్‌కు ఏడాదికి 30 కోట్ల ఆదాయం వస్తోందని, దాన్ని 50 కోట్లకు పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ సంస్థకు పూర్వవైభవం తీసుకురావటానికి కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ అమరేంద్ర రెడ్డి మాట్లాడుతూ టీపీసీ సమావేశం సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విలువైన సూచనలు, సలహాలు అందించారని, తప్పకుండా వాటిని పాటిస్తామన్నారు. కమిటీ సభ్యులు దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా ప్రయత్నిస్తామన్నారు. ఎంపీ సహకారంతో జిల్లాలో బిఎస్ఎన్ఎల్ సంస్థ బలోపేతానికి మరింత కృషి చేస్తామని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీ సభ్యులు కటారి రమణయ్య, గుర్రం మాల్యాద్రి, ప్రసాద్, బ్రహ్మానందం, రమేష్ బాబు, ముంగర గోపాల్, అనూష, సురేంద్ర రెడ్డి, డిజిఎం ఎం.శ్రీనివాస రావు, ఐఎఫ్ఏ శ్రీనివాసరావు, ఏజీఎం పి.శ్రీని వాసరావు, ఇతర ముఖ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్2 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి



**నెల్లూరు,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త - కలెక్టరేట్** జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) గ్రూప్2 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాలులో గ్రూప్2 పరీక్షల కోఆర్డినేషన్ అధికారి, కందుకూరు సబ్‌కలెక్టర్ టి శ్రీపూజ, డిఆర్‌వో ఉదయ భాస్కర్‌రావుతో కలిసి పరీక్షల నిర్వహణపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 23న జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరులోని వి.ఆర్. పిజి స్టడీస్, నెల్లూరు ధనలక్ష్మిపురంలోని శ్రీ చెతన్య జూనియర్ కళాశాల, వెంకటాచలం సమీపంలోని క్యూబా ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరు అపోలో హాస్పిటల్ సమీపంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, కలివెలపాలెం, ధనలక్ష్మిపురంలోని నారాయణ ఇంగ్లీషుమీడియం స్కూల్, నెల్లూరు రామలింగాపురంలోని జగన్స్ డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఏడు పరీక్షాకేంద్రాలకు ఏడుగురు లైజనింగ్ అధికారులను నియమించినట్లు చెప్పారు. మొత్తం 4102 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన చెప్పారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్ఒపి) ప్రకారం పరీక్షలను పక్కాగా నిర్వహించాలన్నారు. పరీక్షల సమన్వయ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, సిసి కెమెరాల ఏర్పాటు మొద్కలెన మౌలిక వసతులు, భద్రతాల చర్యలు సక్రమంగా ఉండేలా పరీక్షా కేంద్రాలను వ్యక్తిగతంగా పరిశీలించాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలో కూడా సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీ పంలో జెరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు తెరుచుకోకుండా 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సెల్‌ఫోన్లను పరీక్షా కేంద్రంలోని డిపాజిట్ కేంద్రంలో డిపాజిట్ చేయాలన్నారు. ప్రతిఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ముందస్తు చర్యలు చేపట్టి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం పరీక్షల కోఆర్డినేటింగ్ అధికారి టి.శ్రీపూజ పరీక్షలకు సంబంధించి సాంకేతికపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకుపలు సూచనలుచేశారు. ఇన్విజిలెటర్లకు ముందుగాఅన్ని సూచనలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణవేణి, సెక్షన్ అధికారులు అంజన, ఆర్.వి.రమణ, పరీక్షల లైజనింగ్ అధికారులు శ్రీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణ వాహన డ్రైవర్లు క్రమశిక్షణ పాటించండి
### కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న చెత్త సేకరణ వాహనాల డ్రైవర్లు క్రమశిక్షణ పాటించి, నిర్దేశించిన సమయానికి తమకు కేటాయించిన డివిజన్లలో విధులకు హాజరు కావాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ గురువారం స్థానిక టి.బి. ఆసు పత్రి వెహికల్ షెడ్డును తనిఖీ చేశారు. డ్రైవర్లంతా నిర్దేశించిన సమయానికి వాహన షెడ్డుకు చేరుకుని హాజరు వేయాలని సూచించారు. సమయానికి హాజరైన వారందరూ కలిసి బృందంగా ఫోటో తీసి క్రమం తప్పకుం డా ప్రతిరోజు తనకు పంపించాలని కమిషనర్ ఆదేశించారు. ఉదయం 6 గంటల నుంచి తమకు కేటాయిం చిన డివిజన్లలో చెత్తసేకరణ విధులకు డ్రైవర్లంతా హాజరు కావాలన్నారు. వాహనాలకు డీజిల్ నింపు కోవడంలో జాప్యం లేకుండా ముందురోజునే నింపుకోవాలని కమిషనర్ డ్రైవర్లకు సూచించారు. విధులలో అలసత్వం వహించకుండా నిబద్దతతో పని చేయాలని కమిషనర్ వారికిసూ చించారు. వెహికల్ ఇంచార్జ్ రఘురాం, శానిటేషన్ సూపర్వైజర్ నరసింహారావు, వార్డు సచివాలయ శానిట షన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గ్రామాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి
### - జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



**సంగం ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** సంగం వెలుగు కార్యాలయంలో ఎంపిపి పద్మావతమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొన్నారు. ఎంపిడిఓ గ్రామాలలో జరిగిన అభివృద్ధి ప్రణాళిక గురించి వివరించారు. అనంతరం ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతు గ్రామాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని ఆమె అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కర్ సోలార్ విద్యుత్ ఉత్పాదన ( సూర్యఘర్)ను ఏర్పాటు చేసుకోవాలని తద్వారా విద్యుత్ ఆదా అవుతుందని ఆమె పేర్కున్నారు. ఈ సందర్భంగా వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతు వెంగారెడ్డిపాళెం కమ్యూనిట్ హాల్‌కి ప్రహరి గోడ అవసరమని ఆయన కోరారు. వెంటనే ఆమె స్పందించి పరిశీలిస్తామని హామి ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూస్ శాఖ ద్వారా అంగన్‌వాఈ సెంటర్‌లకు బాత్‌రూంలు రన్నింగ్ వాటర్‌కి నిధులు ఇచ్చి వున్నామని ఎందుకు పూర్తి చేయాలేదని ప్రశ్నించారు. వెంటనే పూర్తి చేయాలని సంబందిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో జడ్‌పిటిసి రావుల లక్ష్మి, డిప్యూటి తహసిల్దారు. సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# మిర్చి రైతుల విషయంలో చంద్రబాబు డ్రామాలు : మాజీ మంత్రి కాకాణి



**నెల్లూరురూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త** కేంద్ర మంత్రికి సీఎం లేఖ ఒక పెద్ద బోగస్ నెల్లూరు రూరల్ మిర్చి రైతుల్ని సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నాడని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. నెల్లూరులోని వైయస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. నాఫెడ్‌కు లేఖ రాసిన సీఎం మిర్చి రైతులను వంచించారు. గతంలో ఏనాడూ నాఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరగలేదు చిత్తశుద్ధి ఉంటే ఎంఐఎస్ ద్వారా ఆదుకోవాలని కోరేవారు. అసలు మిర్చి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశం సీఎంకు లేదు అన్నారు. ఉద్యాన శాఖ అధికారులిచ్చిన రిపోర్టును చంద్రబాబు పట్టించుకోలేదు అని తెలిపారు. జగన్ గుంటూరు పర్యటనలో మొత్తం భద్రతా వైఫల్యం కళ్లకు కట్టినట్టు కనిపించిందన్నారు. ఉద్దేశపూర్వకంగానే ఆయనకు భద్రత కల్పించ లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే ఓర్వలేక పోతున్నారన్నారు. జగన్ పర్యటనతోనే రైతు సమస్యలపై ప్రభుత్వంలో చలనం వచ్చిందన్నారు. గతంలో ఏనాడూ నాఫెడ్ ద్వారా మిర్చి కొనుగోళ్లు జరపకపోయినా మిర్చి రైతులను ఆదుకోవాలని కోరుతూ నాఫెడ్‌కి బోగస్ లేఖ రాసిన సీఎం చంద్ర బాబు, మరోసారి రైతులను దారుణంగా వంచించారని అన్నారు. మిర్చి రైతులపై సీఎం చంద్రబాబుకు నిజం ఆచిత్తశుద్ధి ఉంటే, మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పదకం (ఎంఐఎస్)లో రైతులను ఆదుకోవాలని కోరేవారని ఆయన తెలిపారు. రైతులను ఆదుకోవాలన్న చిత్తశుద్ధి సీఎంకు లేదు కాబట్టే, ఉద్యాన శాఖ అధికారులు చెప్పిన రూ.3,480 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ గురించి పట్టించుకోలేదని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే ఓర్చుకోలేకపో తున్నారన్న ఆయన, రైతుల అవస్థలు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. టీడీపీ కూటమి పాలనలో ఏ పంటకూ గిట్టుబాటు ధర దక్కడం లేదు. ఒకవైపు దిగుబడులు పడిపోయి, మరోవైపు మద్దతు ధర దక్కకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు చెప్పారు .మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ వైయస్సార్సీపీ అధినేత వైయస్ జగన్ నిన్న (బుధవారం) గుంటూరు మిర్చి యార్డును సందర్శించి రైతులతో మాట్లాడితే కూటమి ప్రభుత్వం తట్టుకోలేకపోతోంది. రైతులకు అండగా నిలవాలని జగన్ వెళితే, వాస్త వాలను మరుగుపర్చి ప్రజల దృష్టి మళ్లించేందుకు విష ప్రచారం చేస్తోంది. మమ్మల్ని ప్రశ్నిస్తే మీపై బు రద జల్లుతాం.. అన్నట్లుంది ప్రభుత్వ వ్యవహారం. ఆఖరుకి రైతులను కూడా అవమానించే విధంగా ప్రభుత్వం, ఎల్లో మీడియా వ్యవహరిస్తోంది విరుచుకుపడ్డారు. జగన్ గుంటూరు మిర్చి యార్డు పర్యటనతో ప్రభుత్వంలో చలనం వచ్చింది. రైతుల సమస్యలపై కనీసం చర్చ మొదలైంది. ప్రభుత్వం రైతులను గాలికొదిలేసినప్పుడు, వారి బాధ్యతను గుర్తు చేయడానికి మాజీ సీఎం జగన్ పర్యటిస్తే, దానిపై ఆక్రోషం వెళ్లగక్కుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, ఇతర టీడీపీ నాయకులకు నా ఓపెన్ ఛాలెంజ్. మీరు నేరుగా మిర్చి యార్డుకు వెళ్లి రైతుల సమస్యల గురించి అడిగి రాగలరా? మిర్చి రైతులు మిమ్మల్ని కారం దంచినట్టు దంచకుండా వదిలిపెట్టరాని తెలిపారు. అచ్చెన్నాయుడి ప్రెస్‌మీట్ చూస్తే.. టీడీపీ ఆఫీసు నుంచి వచ్చిన పేపర్ చదవడం తప్ప, ఆయనకు రైతుల సమస్యలపై ఏ మాత్రమైనా అవగాహన ఉందా? అనే అనుమానం కలిగింది. అలాంటి వ్యక్తి వ్యవసాయ మంత్రి కావడం మన రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం అన్నారు. గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో కేవలం మిర్చి పంటకే కాదు. పసుపు, పత్తి, అరటి, ఉల్లి, పెసర, మినుము పంటలకు మద్దతు ధర కల్పించాం. కానీ నేడు చంద్రబాబు ఇస్తామన్నవి ఇవ్వకపోగా, గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలు కూడా లేకుండా చేశారని కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

## కాశీపాళెం వద్ద రెచ్చిపోయిన కుక్కలు ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు



**బుచ్చి ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం కాశీపాళెం వద్ద మూడుకుక్కలు రెచ్చిపోయి పలువుర్ని కరిశాయి. కొంతమంది తప్పించుకున్నారు. కావలి కృష్ణమ్మ అనే మహిళను తీవ్రంగా కరవడంతో ఆమె కండతో కూడా ఊడివచ్చింది. అలాగే మరొక బాలుడ్ని తీవ్రంగా గాయపరచింది. ఈ విషయంపై స్పందించిన టిడిపి నాయకులు హాస్పటల్ డైరక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డితో కలిసి డైరక్టర్ మరియు టిడిపి నాయకులు తాళ్ళ నరసింహస్వామి వారిని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొని వెళ్లి వైద్యం చేయించారు. మున్సిఫల్ అధికారులు స్పందించి పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

## బిఎస్ఎన్ఎల్ అధికారులను కలిసిన టెలికాం సభ్యుడు బ్రహ్మానందం



**కావలి, ఫిబ్రవరి20 ప్రభాతవార్త :** బిఎస్ఎన్ఎల్ కావలి డివిజన్ కార్యాలయంలో బిజెపి సీనియర్‌నేత బిఎస్ఎన్ఎల్ జిల్లా టెలికాం అడ్వైజరి కమిటిసభ్యుడు కుట్టుబోయిన బ్రహ్మానందం అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కావలి డివిజన్ పరిధిలో బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన సమాచారంను బ్రహ్మానందం అడిగి తెలుసుకున్నారు. కావలి డివిజన్ పరిధిలో టెలికాం సేవలను ప్రజలకు చేరువయ్యేలా తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. రానున్న రోజుల్లో బిఎస్ఎన్ఎల్ అభివృద్ధిపథంల నడుస్తుందని బ్రహ్మానందం తెలిపారు. టెలికాం ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్ టవర్స్, తదితర అంశాలపై చర్చించారు. ఇటీవల కేంద్రబడ్జెట్‌లో టెలికాం నెట్‌వర్క్‌కు సంబంధించి నిధుల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం కమ్యూనికేషన్‌శాఖ తరఫున పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, బిజెపి నాయకుల సహకారంతో జిల్లా టెలికాం అడ్వైజరి కమిటి సభ్యులుగా నియమించడంపట్ల బ్రహ్మానందం ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో టెలికాం డిఈ సాయికుమార్, శ్రీనివాసులు, జెటిఓ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## 10వ వార్డులో బ్లాక్‌స్పాట్‌ను తొలగించి గ్రీన్‌స్పాట్



**కావలి, ఫిబ్రవరి20 ప్రభాతవార్త :** కావలి పట్టణం 10వ వార్డులో చెత్త,చెదారాలతో అలరారుతున్న బ్లాక్‌స్పాట్‌ను తొలగించి అక్కడ తులసిమొక్క ఏర్పాటుచేసి గ్రీన్‌స్పాట్‌గా మార్చినట్లు కావలి మున్సిపల్ కమీషనర్ జి. శ్రావణ్‌కుమార్ గురువారం తెలిపారు. తులసిమొక్క ఏర్పాటుచేసిన ప్రాంతంలో చెత్త,చెదారాలు వేయకుండా పూజించాలని ఆయన కోరారు. ఆ ప్రాంత ప్రజలు పాల్గొని తులసిమొక్కను పూజించారు. కావలి పట్టణంలో ఎక్కడ చెత్త,చెదారాలు వేస్తున్నారో అక్కడ తులసిమొక్కలు ఏర్పాటుచేసి గ్రీన్‌స్పాట్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రజలు సహకరించాలన్నారు.

## గురు దంపతుల స్వర్ణోత్సవ జగత్‌కళ్యాణ మహోత్సవం

**కావలి, ఫిబ్రవరి20 ప్రభాతవార్త :** కావలి పట్టణ పాతవూరు శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంపక్కన వేంచేసిఉన్న శ్రీ షిర్డిసాయిబాబా మందిరంలో పూజ్యశ్రీ గురుదంపతుల (భరద్వాజ మాష్టర్, అలివేలు మంగతాయారమ్మ దంపతులు) స్వర్ణోత్సవ జగత్‌కళ్యాణ మహోత్సవం ఈ నెల 22వ తేది జరుగుతుందని శ్రీ సద్గురు తాయిమాష్టర్ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21వ తేది అవదూతలను వివాహ మహోత్సవంకు సాంప్రదాయపద్ధతిలో కళ్యాణవేదికకు ఆహ్వానించడం జరుగుతుందని తెలిపారు. అదేరోజు ఉదయం 9 గంటలకు గురుదంపతులకు మంగళస్నానం (నలుగు మహోత్సవేడుక) జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 7 గంటలకు ఎదుర్కోల జరుగుతుందన్నారు. కళ్యాణ మహోత్సవానికి భక్తులు తరలిరావాలని కోరారు.

## గూడలభాస్కర్‌రావు పెద్దకర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**కావలి, ఫిబ్రవరి20 ప్రభాతవార్త :** కావలిపట్టణ 26వ వార్డులో జనతాపేటకు చెందిన టీచర్ ప్రతాప్ తండ్రి గూడలభాస్కర్‌రావు పెద్దకర్మ కార్యక్రమంలో గురువారం మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి వెంట గోసల గోపాల్‌రెడ్డి, పాలవెల్లి పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.2 వేలతో రూ.40 లక్షల ప్రమాద బీమా



**పొదలకూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** భారతీయ స్టేట్ బ్యాంకు వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని (పీఏఐ) మరింత విస్తరించిందని, ఏడాదికి రూ.2000 ప్రీమియంతో రూ.40 లక్షల ప్రమాద బీమా కల్పిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందని పొదలకూరు ఎస్బీఐ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ పి.ఎస్. రాజు గురువారం అన్నారు. ఈ వ్యక్తి గత ప్రమాద భీమా పాలసీ పథకాన్ని పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లను న్నట్లు తెలిపారు. ప్రీమియం రూ.100కు రూ.2 లక్షలు , రూ. 500కు 10 లక్షలు, రూ 1000కు 20 లక్షలు, గరిష్టంగా రూ.2 వేలకు రూ.40 లక్షల భీమా పొందవచ్చని వివరించారు. రోడ్డు ప్రమాదాలు, కరెంట్ షాక్, వరదలు, భూకంపం, పాము, తేలు కాటు మరణాలకు భీమా వర్తిస్తుందని చెప్పారు. 18 నుంచి 70 ఏళ్ల వయసున్న వారెవరైనా భీమా చేయించుకోవచ్చని వెల్లడించారు. ఆసక్తి కలిగిన ఖాతాదారులు స్థానిక బ్యాంకును సంప్రదించాలన్నారు.

## నిద్రమత్తులో ట్రావెల్ బస్సు డ్రైవర్.. తృటిలో తప్పిన ప్రమాదం




**కోవూరు,ఫిబ్రవరి 20ప్రభాతవార్త :** కోవూరు మండలం రామన్నపాలెం జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున వైజాగ్ నుంచి బెంగళూరుకు 27 మంది ప్రయాణికులతో వెళ్తున్న నవయుగ ట్రావెల్స్ బస్సు రహదారి పక్కనే ఉన్న జయ ఫిల్లింగ్ స్టేషన్‌లోకి దూసుకెళ్లి పెట్రోల్ పంప్‌ను ధ్వంసం చేసింది. ఈ సమయంలో ట్రావెల్ బస్సు డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది,. ప్రమాదం జరిగిన సమయంలో పెట్రోల్ లీక్ కాకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. బస్సు డ్రైవర్ అతివేగంలో నిద్రమత్తులో ఉండడంతో వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ తెలిపారు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయానికులకు గాయాలు కాకపోవడం గమనార్హం. ప్రమాద విషయం తెలుసుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సిబ్బందితో సంఘటనా స్థలనికి వెళ్లి బస్సును క్రేన్ సహాయంతో పక్కకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో పెట్రోల్ లీక్ అయుంటే పెనుప్రమాదం సంబవించేదని ప్రయాణికులు వాపోయారు. ఒక్కసారిగా బస్సులో ఉన్న ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఏం జరిగిందో అని తెలుసవుకునే లోగా బస్సు పెట్రోల్ పంపును డీకొనడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ మేరకు బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## టెలికాం అడ్వైజరి కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త-వైద్యం :** నగరంలోని వీఆర్సీ సమీపంలో ఉన్న భారత్ సంచార్ నిగం లిమిటెడ్ కార్యాలయంలో జరిగిన టెలికాం అడ్వైజరి కమిటీ సమావేశానికి గురువారం హాజరైన నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, బీఎస్ఎన్ఎల్ ఎన్ఎఫ్‌టీ ఈ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పీసీ రాణి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, ఆ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయండి



**ఉదయగిరి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గురువారం జనవిజ్ఞాన వేదిక దస్తగిరి అహ్మద్, ఎమ్మార్పీఎస్ బెజవాడ బాల గురవయ్య, రైతు సంఘం కాకు వెంకటయ్య, ఎస్ఎఫ్ఐ సురేష్‌లతో పాటు వెలుగొండ ప్రాజెక్టు సాదన సమితిరౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాదిగా పాలకుల నిర్లక్ష్యానికి నిరాధణకు గురై ఉదయగిరి ప్రాంత ప్రజలు ఎన్న కష్టనష్టాలు పడుతూ బాధలకు గురి అవుతూ ఇక్కడ సంపాదనలేక వేరే ప్రాంతాలకు వలసలు పోతూ దుర్భరమైన పరిస్థితిలో ఉన్నారని ఈ పరిస్థితి మారాలంటే ఈ ప్రాంతానికి సాగునీరు అంది ఇక్కడ వ్యవసాయం అభివృద్ది చెంది ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలని అన్నారు. వెలుగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన నెల్లూరు జిల్లాలోని వరిగుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామం దగ్గర నిర్మాణంలో ఉండి రెండు టీఎంసీలు నీటి నిల్వ సామర్థ్యం కలిగిన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ నిర్మాణం 1995 లో శంకుస్థాపన జరిగి అప్పటి నుండి నిర్మాణం కొనసాగుతూనే ఉంటూ ప్రస్తుతం 37 సంవత్సరాలు గడిచినప్పటికి పూర్తికాని ఈ రిజార్వాయర్ నెల్లూరు జిల్లా ప్రాంతంలోని 80 వేల ఎకరాల సాగునీటికి పరిసర ప్రాంతాల గ్రామాల తాగునీటికి ఉద్దేశించిన ఈ రిజర్వాయర్ నిర్మాణం ఇప్పటికే పూర్తి చేసుకోగా రైతాంగానికి ఉపయోగపడకపోవడంతో రిజర్వాయర్ పరిస్థితిని పరిశీలించేందుకు నెల్లూరు జిల్లా రైతు సంఘం నాయకులు జన విజ్ఞాన వేదిక నాయకులు రిజార్వాయర్‌ను సందర్శించడం జరిగిందన్నారు. రిజార్వాయర్ స్థితిని అక్కడి పరిస్థితిని గమణించి స్థానిక రైతులు, గ్రామస్తులతో కలిసి చర్చించారు. అనంతరం రిజర్వాయర్ 400 కోట్ల రూపాయలు నిధులు వెచ్చిస్తే పూర్తి స్థాయి సామర్థ్యంతో ఈ రిజర్వాయర్ ఉపయోగపడుతుందనిదాని కారణంగా 80వేల ఎకరాల సాగులోకి వచ్చి మెట్ట ప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయోగపడుతుందని దాదాపు రెండు లక్షల మంది ప్రజలకు మంచినీరు అందుతుందని ఇక్కడ సందర్శించిన రైతు సంఘం నాయకులు జనవిజ్ఞాన వేదిక నాయకులు ప్రజలతో మాట్లాడారు. వెంటనే ఈ రిజర్వాయర్ నిధులు విడుదల చేసి పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి సామర్థ్యాన్ని తీసుకుని రావాలని ప్రజలకు అందుబాటులో తీసుకుని రావాలని డిమాండ్ చేశారు.

## జ్ఞానజ్యోతికార్యక్రమంపై అంగన్‌వాడీలకు శిక్షణ



**వలేటివారిపాలెం పిబ్రవరి 20, ప్రభాతవార్త :** పాఠశాలలలో త్వరలో ప్రారంభించబోవు నూతన విద్యావిధానంలో బాగమైన జ్ఞాన జ్యోతి కార్యక్రమం పట్ల అంగన్‌వాడీ సిబ్బ ంది అవగాహన పెంచుకోవాలని మండల ఎంఈవో -1 రవికుమార్ అన్నారు.ఐసీడీఎస్ కందుకూరు సీడీపీవో శర్మిష్ఠ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా వలేటివారిపాలెం హైస్కూలులో అంగన్‌వాడీ సిబ్బందకి జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.డీఆర్‌పీలు జనార్దన్,సుకన్య,సూపర్‌వైజర్ సునీతలు వీరికి వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.ఈ నేపద్యంలో గురువారం మండల విద్యాశాఖాధికారి-2 రవికుమార్,సీడీపీవోశర్మిష్ఠ,ఎంవీవో-2మల్లికార్జునరావుతో కలిసి శిక్షణాకార్యక్రమం తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ డీఆర్‌పీలు ఇస్తున్న శిక్షణాంశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.తాజా సమాచారంపై అప్‌డేట్ కావాలని అన్నారు. మెరుగైన విద్యాబోధన కలి ్పంచెందుకు ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని అమల్లోకి తెసు ్తన్న విషయంపాఠకులుకు విధితమేనన్నారు.ఇందులో బాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ఆయా ప్రభుత్వ పాఠశాలల పరిధిలోకి తెస్తున్నట్లు తెలిపారు.విద్యార్దుల సంఖ్య ఆదారంగా పీపీ1,పీపీ2 కేటగిరీలతోపాటు 1,2,3,4,5 తరగతులను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తున్నట్లు చెప్పారు.ఈ నేపద్యంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతోపాటు అంగన్‌వాడీ సిబ్బంది సమాంతరంగా బోధనాభ్యాసం చేయనున్నట్లు ఆయన వివరించారు.నూతన విద్యావిధానంలో అంగన్‌వాడీల పాత్ర-చేపట్టాల్సిన ఆదునిక బోధనాపద్దతులును రిసోర్స్ పర్సన్స్ వివరించారు.ఈ కార ్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు పలువురు సిబ ్బంది పాల్గొన్నారు.

## రైలు పట్టాల పైన గుర్తుతెలియని మృతదేహం

**బిట్రగుంట ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కెఎమ్ నెం. 225/1618 పోస్ట్ ల మద్య దిగువలైనలో కావలి- తెట్టు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని 55-60 సంవత్సరాలు వయసు గల గుర్తుతెలియని మగ వ్యక్తిమృతదేహన్నిగురువారం కనుగొన్నట్లు జిఆర్పి హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు. మృతుడు ఆత్మహత్య చేసుకోవాలని ఉద్దేశంతో గానీ, లేదా రైల్వే ట్రాక్ దాటుతూ గుర్తుతెలియని రైలు బండి గ్రుద్దుట వలన గాని, కలిగిన గాయముల వలన మరణించి ఉండవచ్చునని తాము భావిస్తున్నట్లు చెప్పారు. మృతుడు లైట్ గ్రీన్ రంగు గల ఫుల్ హాండ్స్ షర్టు, బ్లూ అండ్ వైట్ చెక్స్ కలిగిన లుంగీ ధరించి ఎత్తు 5.6 ఎరుపు రంగు కలిగి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పేర్కొన్నారు..

## సాయి సన్నిధిలో వైభవంగా అభిషేకాలు



**సంగం ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామంలో షిర్డిసాయి బాబా మందిరంలో గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో స్వామి వారికి గోవు పాలతో ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు.అలాగే స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. రాత్రికి స్వామి వారికి పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్ద ప్రసా దాలు అందించారు.

## సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి పార్టీల విలీన సభను జయప్రదం చేయండి



**ఉలవపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఫిబ్రవరి 23వ తేదీ విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య ఎంబికే భవన్లో జరుగుత రెండు సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కామ్రేడ్ ఆర్.మోహన్ పిలుపునిచ్చారు. గురువారం ఉలవపాడు మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) డెమోక్రసీ పార్టీ విలీన సభ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కామ్రేడ్ ఆర్.మోహన్ మాట్లాడుతూ అంటరానితనం మతోన్మాదం పేదరికం లేని నూతన సమాజం కోసం సమ సమాజ నిర్మాణం కోసం భారతదేశంలో ప్రారంభమైన విప్లవజము అనే విజయాలు సాధించింది, అనేక వైఫల్యాలు చది కూడా చూసింది. అదే సందర్భంలో అనేక చీలికలకు కూడా గురైంది. ఈ నేపథ్యంలో కొన్ని అనివార్య పరిస్థితుల్లో 2013లో చీలికల గురైన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ గత 13 సంవత్సరాలుగా రెండు పార్టీలుగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రెండు పార్టీలు ఐక్యత చర్చలు జరిపి ఫిబ్రవరి 23న విజయవాడలో ఎంబీకే భవన్ లో విలీన సభ జరుగుతున్నది. ఈ సభను జయప్రదం చేయాలని ప్రజలకు, విప్లవ అభిమానులకు, ప్రజాతంత్ర వాదులకు ప్రజా స్వామ్యవాదులకు విజ్ఞప్తి చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి కామ్రేడ్ సీహెచ్ వెంకటేశ్వర్లు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రాతతో సాధన చేస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు



**బిట్రగుంట ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ఏకగ్రాతతో విద్యను సాధన చేస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవడం సాధ్యపడుతుందని స్వర్గీయ అమర బచ్చు చారిటబుల్ ట్రస్టి బచ్చు కృష్ణ కుమార్, సంధ్య దంపతులు పేర్కొన్నారు.బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శిధిలమైన ఐదు గదుల భవన సముదాయాల స్థానంలో అమరాచారిటబుల్ ట్రస్ట్ ఆర్థికసహాయంతో ఆధునికరించిన గదులను గురువారం అమరాబచ్చు చారిటబుల్ ట్రస్ట్ అభివృద్ధి మేనేజింగ్ ట్రస్టీ బచ్చు కృష్ణ కుమార్, సంధ్యా దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కావలసినది ఏకాగ్రత, క్రమశిక్షణ ముఖ్యంగా ఉండాలన్నారు. తాను కూడా ఇదే ఉన్నత పాఠశాలలో ఎంతో క్రమశిక్షణతో చదువుకొని ఈ స్థాయికి చేరుకున్నామని తమ పాత జ్ఞాపకాలను విద్యార్థులకు వివరించారు. విద్య పట్ల శ్రద్ధ, సేవభావం వంటి లక్షణాలు నేర్చుకోవాలన్నారు. ఈరోజు పనిని అదేరోజు చేయాలన్నారు. వాయిదాల పద్ధతి నేర్చుకోవడంలో ఉండకూడదన్నారు. ఆధునికరించించిన భవనాలలో ట్రస్ట్ తరుపున సౌకర్యాలు మెరుగుపర్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండూరి మంజుల,ఎంఈఓ లు జయమ్మ,,పెంచల నరసింహారావు, చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ డాక్టర్ ఆనందసాగర్, మండల టిడిపి అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, ప్రసన్నుడి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, విశ్రాంత ఇంజనీర్ గోపికృష్ణ,ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ ఠాగూర్, గాలి గంగాధర్ రావు, బోగోలు శ్రీ షిర్డీ సాయిబాబామందిర సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆట పాటలతో కూడిన విద్య పిల్లలకు ఎంతో ఉపయోగకరం



**కోవూరు,ఫిబ్రవరి 20ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్య ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని ఐసీడీఎస్ ఏసీడీపీవో శారద అన్నారు. కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతుల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రానికి వచ్చే చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్య వారికి బలవర్ధకమైన పౌష్టికాహారం అంది ంచాలన్నారు. ఈ శిక్షణా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నారు. చిన్నారుల శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారుప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి నెల 10వ తేదిలోగా చిన్నారులకు సంబంధించిన ఎత్తు, బరువు తూచి ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. అదేవిధంగా కేంద్రాల పరిధిలో ఉన్నగర్భవతులకు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్య క్రమంలో రిసోర్స్ పర్సన్‌లు శ్రీనివాసులు, మహేంద్ర, సూపర్‌వైజర్లు రాధిక,ప్రసన్న లక్ష్మిలు పలు సూచనలు చేశారు.

## తెగుళ్ల మందులు విచక్షణారహితంగా వాడరాదు



**గంగవరం(కోవూరు),ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** పురుగుమందులు, తెగుళ్ల మందును రైతులు విచక్షణ రహితంగా కలపి వాడడం వలన మిత్ర పురుగులు కూడా నిశించే అవకాశం ఉందని, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పి. శివన్నారాయణ తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలో వరి సాగు చేసిన పొలాలను గురువారం తెగులు విభాగం శాస్త్రవేత్త మధుసూదన్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగుమందులను, తెగుళ్ల మందును పిచికారి చేసే సమయం కనీసం 15 రోజులు వ్యవధి ఉండాలన్నారు. రెండు కలిపి వాడడం వలన ఖర్చు పెరగడమే కాకుండా దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మేరకే మందులు వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు సుజాత, జిల్లా వ్యవసాయ సంచాలకులు మారుతీ దేవి, మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, గ్రామ వ్యవసాయ సహాయకులు చైతన్య, చాద్విక, రైతులు ఉన్నారు.

## టీబీ వ్యాదిపై విద్యార్థులకు అవగాహన



**కోవూరు,ఫిబ్రవరి 20ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశ మందిరంలో విద్యార్థులకు టీబీ వ్యాధి, అది ఏ విధంగా సంక్రమిస్తుందో అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ బి. నాగరాజు, మాటా ్డుతూ ప్రాథమిక దశలో ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఉచితంగా ఈ వ్యాధికి సంబంధించిన నిర్ధారణ పరీక్షలను సమీపంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రంలో గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గానీ ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. . ప్రధానంగా ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు ఎస్కే దిలీప్, ఎస్కే ఇలియాజ్, ఎస్కే రియాజ్‌లు చిన్నారులకు ఈ టీబీ వ్యాధికి సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు నాయుడు ఫిజికల్ డైరెక్టర్ బి. వెంకటరమణయ్య, కె. చంద్రకిరణ్, , ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## కేంద్రబడ్జెట్‌కు నిరసన-ఎమ్మార్వోకి వినతిపత్రం



**వలేటివారిపాలెం ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** కేంద్రప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు స్దానిక ప్రజాసంఘాల నేతలు గురువారం వలేటివారిపాలెంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ ఆధ్వర్యంలో స్దానిక తహసిల్దార్ అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఈ బడ్జెట్ కార్పోరేట్ శక్తులకు, సంపన్న వర్గాలకు అనుకూలంగా ఉందన్నారు. పేదలు, బడుగు బలహీనవర్గాలకు,వ్యవసాయకూలీలకు రైతులపై బారం మోపుతుందన్నారు.ఉపాధిహమీపథకానికి రూ.2లక్షలు కోట్లు కేటాయించాల్సి ఉంటే కేవలం 86 వేలకోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నట్లు ఆరోపించారు.ఎస్సీ,ఎస్టీ, మహిళాసంక్షేమానికి గత బడ్జెట్‌కంటే 5శాతం పెంచాల్సి ఉంటే తగ్గించిందన్నారు. ఎరువులపై సబ్సిడీని ఎత్తివేసనిట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. స్కీంవర్కుర్స్‌కు వేతనాలపెంపు ఊసే లేదన్నారు.అన్ని రంగాలకు అన్యాయం చేసిన బడ్జెట్‌ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కావున సవరించాలని కోరారు.అనంతరం తహసిల్దార్ అమీద్‌కు వినతిపత్రం అందచేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయు, కేవిపిఎస్ నేతలు కుమార్, చెన్నకేశవులు,దార్ల మాధవరావు, పి నాగార్జున వీరభద్రయ్య, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభావతమ్మకు నివాళులర్పించిన వేమిరెడ్డి దంపతులు



**ఉలవపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** కరేడు గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తల్లి, మాజీ ఎంపీటీసీ ప్రభావతమ్మ పెద్దకర్మకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్‌సీడీ-సీడీ -3.0 తనిఖీ



**ఉదయగిరి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఉదయగిరి-1 కొండాయపాలెం విలేజ్ క్లినిక్ పరిధిలోని ఉదయగిరి కంసాలి వీది వీరారెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో జరుగుతున్న అసంక్రమణ వ్యాధులపై నిర్వహిస్తున్న సర్వేను గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య వైద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా స్త్రీలలో వచ్చే రొమ్ము క్యాన్సర్, గర్భాశయము ద్వారా క్యాన్సరు, అండాశయ క్యాన్సర్, నోటి క్యాన్సర్ తదితర క్యాన్సర్లపై, స్ట్రోక్, హైపర్ టెన్షన్ తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం ఈ సర్వేలో పాల్గొనాలని తెలియజేశారు. ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్ రెండు టీములు ఏర్పాటు చేసి ఎన్‌సీడీ సర్వేను నిర్వహిస్తున్నట్లు ఆయనతెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సుప్రజ, స్వాతి, ఆరోగ్య సహాయకులు జి.శ్రీనివాసులు, కే.శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ్ బాబు, ఆశా కార్యకర్తలు రేణుక, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరులో గురుకుల పాఠశాల వార్షికోత్సవం




**అల్లూరు,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** అల్లూరు ఆర్ డి ఆర్ కాలనీ లోని గురుకుల బాలికల పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని గురువారం ప్రిన్సిపల్ ప్రసన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గురుకుల పాఠశాల కన్వీనర్ రమణ ప్రసాద్ ను గురుకుల బాలికల పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్త్ ఆములూరు నుంచి గురుకుల పాఠశాల అల్లూరు కు వచ్చినప్పుడు నుండి విద్యార్థినిలు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధిస్తున్నారని విద్యార్థినిలు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు గురుకుల పాఠశాలలో చదువుతున్న బాలికల తల్లిదండ్రులు వార్షికోత్సవ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థుల ఆటపాటలను తిలకించారు ఈ కార్యక్రమంలో సిద్దా యానాది శెట్టి మేడ శ్రీనివాసులు రెడ్డి గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థినిలు పాల్గొన్నారు

## ప్రారంభమైన జనవిజ్ఞానవేదిక సైన్సువారోత్సవ సంబరాలు



**కావలిరూరల్, ఫిబ్రవరి20 ప్రభాతవార్త :** కావలిపట్టణ జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సైన్సు పోటీపరీక్షల షెడ్యూల్‌ను కావలిపట్టణ జనవిజ్ఞానవేదిక కార్యాలయంలో విడుదల చేయడం జరిగిందని అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు గురువారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ సైన్సు దినోత్సవ కార్యక్రమాలు ఫిబ్రవరి 21వ తేదినుండి 28వ తేదీవరకు వివిధ అంశాలలో సైన్సు పోటీ పరీక్షలు కావలి పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంనందు నిర్వహించడం జరుగుతుంది తెలియచేశారు. సైన్సు పోటీలలో విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు జాతీయ సైన్సు దినోత్సవంనాడు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలియచేశారు. ఈ పోటీలకు పాఠశాల యజమానులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులయొక్క తల్లిదండ్రులు, ప్రజలు సహకరించి ఈ సైన్సు పోటీ పరీక్షలను విజయవంతం చేయాలని కోరారు.

## పర్వత్ రెడ్డితో భేటీ అయిన వెంకటేశ్వరపురం నాయకులు



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** నెల్లూరు నగర నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులకు నేనున్నానంటూ ఎమ్మెల్సీ సిటీ ఇంచార్జ్ పర్వత చంద్రశేఖర్ రెడ్డి భరోసానిస్తున్నారు. సిటీలో పార్టీ బలోపేతానికి ఏరియాలో వారీగా నాయకులతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు వెంకటేశ్వరపురం వైసిపి నాయకులు ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర వైఎస్ఆర్సిపి నాయకులు మస్తాన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కార్యకర్తలు ఆయన్ని కలిశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక డివిజన్లో ప్రజలు పడుతున్న అనేక ఇబ్బందులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారికి చంద్రశేఖర్ రెడ్డి డివిజన్లో ఉండే సమస్యలపై అన్ని విధాల ప్రజా సమస్యలపై పోరాడుదామని పిలుపునిచ్చారు. నియోజకవర్గం నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన వారికి తెలిపారు.

## డిగ్రి ఫలితాల్లో శ్రీచైతన్య డిగ్రి కళాశాల విద్యార్థుల ప్రతిభ

**కావలిరూరల్, ఫిబ్రవరి20 ప్రభాతవార్త :** విక్రమసింహపురి యూనివర్సిటి ఇటీవల విడుదల చేసిన డిగ్రి 5వ సెమిస్టర్ ఫలితాల్లో కావలి పట్టణంలోని శ్రీ చైతన్య డిగ్రి కళాశాల విద్యార్థిని విద్యార్థులు బి.ఎస్.సి, బి.కాం, బి.ఎ, బి.సి.ఎ కోర్సులలోని అన్ని గ్రూపులలో యూనివర్సిటి స్థాయిలో ఉత్తమ మార్కులను, పట్టణస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలను సాధించి టాపర్స్‌గా నిలిచారు. 5వ సెమిస్టర్ ఫలితాలలో బి.ఎస్.సి విభాగంలో డి.మోన్విత 9.71, డివి.లహరి 9.62, పి.పావని 9.56, జి.గాయత్రి 9.3, సి.అపర్ణ 9.0, పి.సుష్మ 8.9, పాయింట్లతో పట్టణ ప్రథమ, ద్వితీయస్థానాలను సాధించడం జరిగింది. బి.సి.ఎ విభాగంలో కె.స్నేహలత 9.52, ఎం.హర్షిణి 9.47, జి.మీనాక్షి, 9.3, టి.సత్యస్వరూప్ 9.3 సాధించడం జరిగింది. బి.కామ్ విభాగంలో ధనశ్రీహిమజ 9.98, జె.స్వాతి 8.97, బి.ఎ విభాగంలో షేక్. ఫిరదౌస్ 8.56, పి.సంధ్య 8.41, అత్యున్నతమైన పాయింట్లను సాధించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బెజవాడ రవికుమార్, కళాశాల డైరక్టర్ పి.జానకిరామ్, అకడమిక్ ప్రిన్సిపాల్ పి.వి.రావు, నాక్ ప్రిన్సిపాల్ రవికాంత్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించడం జరిగింది.

## ఘనంగా నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి 90వ జయంతి



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** దివంగత నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి 90వ జయంతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యులు జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బాల సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నెల్లూరు నగరంలోని ఇందిరా భవన్ లో గురువారం నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాలసుధాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ స్థాయి నుండి జాతీయ చక్రం తిప్పిన ఏకైక నాయకుడు నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి అని అన్నారు. బడుగు బలహీన వర్గాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఏకైక నాయకుడు ఆయన అన్నారు. అలాంటి వ్యక్తి వరద పనిచేయడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సురేష్ బాబు, అల్లావుద్దీన్, ముదిగొండ శ్రీనివాసులు, గణేష్, సుబ్బారావు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐసి కార్యాలయంలో ఉద్యోగులు గంటపాటు వాక్ఔట్ సమ్మె




**కావలి, ఫిబ్రవరి20 ప్రభాతవార్త :** కావలి జీవితభీమా సంస్థలో (ఎల్ఐసి) పనిచేసే క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగులు గురువారం భోజన విరామ సమయంలో గంటపాటు వాక్ఔట్ సమ్మె చేపటారు. క్లాస్-3, క్లాస్-4లో రిక్రూట్‌మెంట్, ఎఐఐఈఎకు రికగ్నేషన్ ఇవ్వాలని ఉద్యోగులు నినాదాలు చేశారు. కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం ఎల్ఐసిలో వందశాతం విదేశీపెట్టుబడులు అనుమతించడాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, కావలి ఐసిఈయు అధ్యక్షులు సిహెచ్ ఫణీంద్రకుమార్, కార్యదర్శి బి.సాయినాథ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసేలా చర్యలు తీసుకోవాలి



**నెల్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త-వైద్యం :** ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వంగల సుజాత సూచించారు. గురువారం నగరంలోని సంతపేటలో ఉన్న డీఎంహెచ్ఓ కార్యాలయంలో సుజాత అధ్యక్షతన శిశు మరణాల సబ్ కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ జిల్లాలో 2024 గత నవంబర్, డిసెంబర్ నెలలో సంభవించిన 9 శిశు మరణాలకు గల కారణాలు, లోపాలు గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీని గుర్తించి త్వరితగతిన రిజిస్టర్లో నమోదు చేసి, అన్ని రకాల పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. హై రిస్క్ గర్భిణీలను గుర్తించి వారికి ఎటువంటి ఆటంకం లేకుండా సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పించాలన్నారు. సుఖ ప్రసవం జరిగే వరకు సంబంధిత ఆరోగ్య పర్యవేక్షకురాలుకు పూర్తి బాధ్యత అప్పగించాల్సిందిగా పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు ఇచ్చేలాగా పుట్టిన పిల్లలందరికి 1 డోస్ 24 గంటలలో ఇవ్వాలన్నారు. ఐదు సంవత్సరంలో లోపు పిల్లలందరికి వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని, పిల్లలకు రక్తహీనత లేకుండా ఐరన్ సిరప్/ మాత్రలు తప్పనిసరిగా ఇచ్చేలా పర్యవేక్షించాల్సిందిగా వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని, అర్హులైన ప్రతి గర్భిణీ స్త్రీకి బాలింతకు జేఎస్‌వై, జేఎస్‌కే పథకాలు క్రింద లబ్ది చేకూరేలాగా చూడాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ ఆదేశించారు. ఏ తల్లి, బిడ్డ కూడా రక్తహీనత వలన, సకాలంలో వైద్య సేవలు అందక మరణించినట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత వైద్య ఆరోగ్య సిబ్బందిపైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సుజాత హెచ్చరించారు. ఈ కమిటీ సమీక్ష సమావేశంలో డీఎల్ఏటీఓ డాక్టర్ షేక్ ఖాదర్ వలి, డీఐఓ డాక్టర్ ఏ.ఉమామహేశ్వరి, పీఓ(ఎఫ్‌పీసీ) డాక్టర్ పీఎల్ దయాకర్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ పి.బ్రిజిత, డాక్టర్ ఎస్.రజని, అసిస్టెంట్ ప్రొఫెసర్ జీజీహెచ్ డాక్టర్ జి.గ్రేస్, ఎస్తేర్, డాక్టర్ శ్రవణ్ కుమార్, డెమోకె కనకరత్నం, డీపీహెచ్ఎన్ఓ జి.మంజుల, ఎస్ఓ కే.సహన, సంబంధిత వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు జడ్పీలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు

**నెల్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త – కలెక్టరేట్ :** నెల్లూరు నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 21న ఏడు స్థాయి సంఘ సమావేశాలు, జడ్పీ, చైర్పర్సన్ ఆనంద్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరుగుతున్నట్లు, జడ్పీ సీఈవో విద్యారమ ఒక ప్రకటనలో తెలిపారు.

# రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం



**కోవూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** రైతులు పండించిన ధాన్యానికి నిర్దేశించిన మద్దతు ధర అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా సహకార శాఖ అధికారి గురప్పఅన్నారు. కోవూరు మండలం పడుగుపాడు సహకార సొసైటీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్‌లో రైతులు ధాన్యం కొనుగోలు చేసేందుకు 298 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 3,56,653 ఎకరాల్లో వరిసాగు చేయడం జరిగిందని, ఇందుకు గానూ 111310 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి పుట్టికి 19720 రూపాయలు , కామన్ రకానికి 19550 రూపాయలు ధర నిర్ణయించడం జరిగిందన్నారు. గత 2023-24 సీజన్‌తో పోలిస్తే ప్రస్తుతం రైతుకు గతం కంటే 117 రూపాయలు పెంచడం జరిగిందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సహకార, సివిల్ సప్లయిస్, వ్యవసాయ, ఆర్టీవో శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయన్నారు. జిల్లాలో 44 బహుళ ప్రయోజన గిడ్డంగులు ఉన్నాయని, రైతులు వాటిని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వీటికి ప్రహరీ గోడ అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంద్వారా చేపట్టేందుకు జిల్లా కలెక్టర్‌ను సంప్రదించడం జరిగిందన్నారు. త్వరలో ఈ పనులు పూర్తి కావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ సీఈవో శ్రీనివాసులు, సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## గ్రామ పంచాయితీ కార్యాలయము, గండవరం

కొడవలూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ఆర్ఓసి నెం.04/2025 **టెండరు ప్రకటన** తేది 20.02.2025

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కొడవలూరు మండలం, గండవరం గ్రామ పంచాయతికి 2025-2026 సంవత్సరమునకు (తే01.04.2025ది తే31.03.2026ది వరకు)ఈ క్రింది షెడ్యూలులో తెలిపిన ప్రకారము సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.టెండర్లలో పాల్గొనువారు తే 06.03.2025ది న మధ్యాహ్నం 02.00 గంటల వరకు టెండరు డిపాజిట్టు చెల్లించి టెండర్లు దాఖలు చేయవచ్చును. తే 06.03.2025 ది సాయంత్రం 03.00 గంటలకు టెండరుదార్ల సమక్షమున టెండర్లు తెరువబడును. టెండరు ధరావత్తు చెల్లించని టెండర్లు తిరస్కరించబడును. ఇతర వివరములు కార్యాలయము పనివేళలయందు అడిగి తెలుసుకొనవచ్చును.

| వ.నెం. | టెండరు వివరములు (తే01.04.2025ది నుండి తే31.03.2026ది) | ధరావత్తు |
|---|---|---|
| 1 | 2025-2026 సం॥నకు వీధి విద్యుత్ పరికరములు దఫాలవారిగా సరఫరా చేయుట | 200.00 |
| 2 | 2025-2026 సం॥నకు pws విడిభాగములు దఫాలవారిగా సరఫరా చేయుట | 100.00 |
| 3 | 2025-2026 సం॥నకు పబ్లిక్ హెల్త్ విడిభాగములు దఫాలవారిగా సరఫరా చేయుట | 100.00 |
| 4 | 2025-2026 సం॥నకు LF మరియు స్టేషనరీ వస్తువులు దఫాలవారిగా సరఫరా చేయుట | 100.00 |
| 5 | 2025-2026 సం॥నకు pws మోటర్లు, పంపుసెట్స్, స్టాటర్లు, మరియు ఇతర రిపేర్లు మరియు వెల్డింగ్ చేయుట (అనుభవము గల మెకానిక్‌ల ద్వారా) | 100.00 |
| 6 | 2025-2026 సం॥నకు వీధులలో చిమ్మి ప్రోగుచేసిన చెత్త చెదారములను, కాలువలలో తీసిన మట్టిని ట్రాక్టరు ద్వారా త్రోలుటకు కూలీలతోటి (ట్రాక్టరు బాడుగ) | 100.00 |
| 7 | 2025-2026 సం॥నకు గ్రామ పంచాయితిలో సేవలు చేయించుటకు గాను కాంట్రాక్ట్ లేబరును 7 మందిని సరఫరా చేయుట(స్వీపర్స్ 05, pws ఆపరేటరు 01, ఎలక్ట్రీషియను 01) | 1000.00 |

గమనిక :- షరతులు వర్తించును. పై టెండర్లు ఆమోదము తెలుపుటకు లేదా రద్దు పరచుటకు గాని తుది నిర్ణయము పంచాయతివారిది. టెండరు తేది శెలవు దినము ప్రకటించినయడల మరుసటి కార్యాలయము పని వేళలయందు స్వీకరించబడును. విధి నిర్వహణలో ఏదేని ప్రమాదములు జరిగిన యడల పంచాయతి వారు భాద్యులుకారు, ఎటువంటి నష్ట పరిహారము చెల్లించబడదు.

సం/-యం.బ్రహ్మానంద రెడ్డి, పంచాయతి కార్యదర్శి, గండవరం గ్రామ పంచాయితి.

## మద్దతు ధర పొందాలంటే రైతులకు ఈకేవైసీ తప్పనిసరి




**సైదాపురం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త** మండలంలో రైతులు పండించిన పంటకు కనీసం గిట్టుబాటు ధర పొందాలంటే తప్పనిసరిగా ఈ పంట, ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి హైమావతి తెలిపారు. మండల పరిధిలోని తురిమెర్ల, ఊటుకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల కొరకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఆమె రైతులకు వివరించారు. రైతులు వేసిన పంటకు కనీస గిట్టుబాటు ధర పొందాలంటే రైతు సేవ కేంద్రం పరిధిలో గల గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ పంట, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. అలాగే మండలం నందు ప్రతి రైతు రిజిస్ట్రేషన్ కూడా తప్పనిసరిగా చేసుకోవాలని ఆమె తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, వ్యవసాయ సహాయకులు రాజశేఖర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ఆక్రమణలు చేపడితే చర్యలు తప్పవు



**కావలి, ఫిబ్రవరి20 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని ప్రధానవీధుల్లో ఆక్రమణలు చేపడితే చర్యలు చేపట్టడం జరుగుతుందని కావలి మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్ తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశారు. గురువారం కావలి పట్టణంలోని తుమ్మలపెంటరోడ్డు, ట్రంకురోడ్డు, తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ అవరోధాలు కల్పిస్తున్న ఆక్రమణలను జెసిబితో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.పట్టణంలోని మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులో, ప్రధానకూడళ్లలో ట్రాఫిక్‌కు అవరోధాలు కల్పిస్తూ షాప్‌లు, బంక్‌లు, తదితరవాటిని ఏర్పాటుచేశారన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాలమేరకు ప్రస్తుతం కొనసాగుతున్నవాటికి ప్రత్యామ్నాయంగా వేరే ప్రాంతాల్లో అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. కొత్తగా ఆక్రమణలు చేపడితే వెంటనే తొలగించడం జరుగుతుందని హెచ్చరికలు చేశారు. రోడ్లమీద ట్రాఫిక్‌కు అవరోధాలు కల్పిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టిపిఒ వివేక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిసి కార్పొరేషన్ రుణాలకోసం లబ్ధిదారులుకు ఇంటర్వ్యూలు



**బిట్రగుంట ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** బోగోలు మండలపరిషత్ కార్యాలయం నందు గురువారం బి.సిరెడ్డి,కాపు,వైశ్య మరియు బ్రాహ్మణ కార్పొరేషన్ సబ్సిడీ రుణములకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధిత బ్యాంకు మేనేజర్ లు శ్రీ ఎల్.ప్రమోద్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ ఐఒబి శ్రీ కె.రామకృష్ణ, బ్రాంచ్ మేనేజర్ యూబిఐఎన్ ,ఎస్.జోసెఫ్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, ఎమ్.గోపి,కెనరా బ్యాంకు, అసిస్టెంట్ మేనేజర్ మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.సుబ్రహ్మణ్యం ఇంటర్వ్యూలు నిర్వహించారు.ఈ ఇంటర్వ్యూలకు యూనియన్ బ్యాంకు -53,ఎస్‌బిఐ-41,ఐఒబి-29,కెనరా బ్యాంకు(ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు)30 మొత్తము:153 మంది అభ్యర్థులు హాజరైనారు..హాజరైన లబ్ధిదారుల దరఖాస్తులు వీరు పరిశీలించారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే



**కావలి, ఫిబ్రవరి20 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని దొడ్ల మనోహర్‌రెడ్డి నారాయణ కళ్యాణమండపంలో గురువారం ఎడవల్లి తిరుపతిరావు, శేషమ్మ దంపతుల కుమార్తె హిమబిందు వివాహవేడుకల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.**-జనతాపేట 26వ వార్డులో...**కావలిపట్టణం జనతాపేట 26వ వార్డులో టీచర్ ప్రతాప్ తండ్రి గూడల భాస్కర్‌రావు పెద్దకర్మ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

**-14వ వార్డు మునుసూరు అరుంధతీయవాడలో...**కావలిపట్టణ 14వ వార్డు మునుసూరు అరుంధతీయవాడకు చెందిన టిడిపి కార్యకర్త పోతిపోక వెంకయ్య పెద్దకర్మ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రగాఢసానుభూతిని వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, ఎఎంసి మాజీ డైరక్టర్ తిరివీధి ప్రసాద్, లింగం మాల్యాద్రి, వల్లేరి వెంకటకిరణ్‌కుమార్, జనసేన నాయకులు జాని, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి



**ఇనమడుగు(కోవూరు),ఫిబ్రవరి 20ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా అంగన్‌వాడీ కార్యకర్తలు చొరవ చూపాలని ఏసీడీపీవో అరుణ తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆట పాటలతో కూడిన విద్యను అందించడం ద్వారా చిన్నారుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో అమలు చేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, డీఆర్‌పీ వెంకటరామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## గీతాంజలిలో విజయవంతంగా మెగా వైద్య శిబిరం



**కోవూరు,ఫిబ్రవరి 20ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మెడికవర్ ఆస్పత్రి,కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు మాట్లాడుతూ తమ కళాశాల సామాజిక సేవా కార్యక్రమాల్లో అగ్రస్థానంలో ఉందన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సిబ్బందిలో సేవా స్ఫూర్తిని పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్‌సందీప్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆస్పత్రికి చెందిన వైదుట్యులు డాక్టర్ రవీంద్రరెడ్డి, డాక్టర్ డీవీ కిరణ్మయి రెడ్డి, సహచర వైద్యులు , సిబ్బంది 300 మంది విద్యార్థులకు పైగా ఈసీజీ, జీఆర్‌బీఎస్, బీఎంఐ, వైటనల్ చెకప్‌లు నిర్వహించిన అవసరమైన మందులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం సభ్యులు, విద్యార్థులు ఉన్నారు.

## తల్లి మందలించిందని పారిపోయిన బాలుడు



**కోవూరు,ఫిబ్రవరి 20ప్రభాతవార్త :** చక్కగా చదువుకోవాలని తల్లి మందలించడంతో ఈ నేపథ్యంలో కొడుకు ఇంటి నుంచి పారిపోయిన రైల్వే స్టేషన్‌లో తిరుగాడుతున్న విషయాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ పరిశీలించి ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన కోవూరుపోలీస్‌స్టేషన్‌లో గురువారం చోటు చేసుకుంది. నెల్లూరులోని బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన చంద్ర శేఖర్ 6వ తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు బుధవారం రాత్రి చక్కగా చదువుకోవాలని తల్లి మందలించడంతో దానికి బాధ పడిన చంద్రశేఖర్ ఇంటి నుంచి పారిపోయి వచ్చి కోవూరు రైల్వే స్టేషన్‌లో తిరుగాడుతున్నాడు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ ఆ బాలుడిని తీసుకుని వచ్చి గురువారం తల్లిదండ్రులు ప్రసాద్, నరసమ్మలకు అప్పగించారు. ఈ సందర్భంగా చక్కగా చదువుకోవాలని చంద్రశేఖర్‌కు కోవూరు ఎస్సై సూచించారు.

## కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు



**కోవూరు,ఫిబ్రవరి 20ప్రభాతవార్త :** ఆలిండియా వామపక్ష పార్టీల పిలుపుమేరకు కోవూరు మండల కేంద్రమైన బజార్ సెంటర్‌లో సీపీఎం పార్టీ కార్యకర్తలు గురువారం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను తగల బెట్టి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శేషయ్య మాట్లాడుతూ 2025లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే విధంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై జీఎస్‌టీల పేరుతో వేలకోట్లు రూపాయలు వసూలు చేసి సామాన్యులకు విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయ సబ్సిడిలపై తగ్గించి వేసిందన్నారు. ఈ బడ్జెట్ చూస్తుంటే కాకులను కొట్టి కార్పొరేట్ గద్దలను మేపుతున్నట్లు ఉందన్నారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీ ఇవ్వడం, ఉపాధి హామీ పనులకు నిధులు తగ్గించడం చూస్తుంటే పేద ప్రజల్లో ఆకలి భారం పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బుజ్జయ్య, సుబ్బారావు, రమణయ్య, సర్దార్, రామయ్య, ప్రసాద్, పెద్దబ్బయ్య, హరి, తదితరులు ఉన్నారు.

## 28న జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఎమ్మార్పీస్ అనుబంధాల సంఘాలు జయప్రదం చేయాలి



**బుచ్చి ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** ఈనెల 28 వ తేది రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఎమ్మార్పీస్ అనుబంధ సంఘాలు కలిసి జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈమేరకు బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని స్థానిక అంబేద్కర్ భవనంలో వారు అనుబంధ సంఘాల సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.తొలుత అంబేద్కర్ విగ్రహం నుండి అంబేద్కర్ భవన్‌కు మందకృష్ణకు పద్మశ్రీ అవార్డు రావడంతో వారు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్రంలో ఎస్‌సి రిజర్వేషన్ల విషయంలో ఎక్కడ కూడా మాదిగలకు అన్యాయం జరగకుండా నిజాయితీగా రిజర్వేషన్లు అందాలనే దిశగా కార్యవర్గ రాష్ట్ర సమావేశాన్ని మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణాలో మాదిగలకు అన్యాయం దృష్టిలో పెట్టుకొని అక్కడ అటువంటివి జరగకుండా ప్రతి ఒక్కరు సమిష్టిగా కలిసి హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమాన్ని ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాల నాయకులు కలిసి జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో ఎంఐఎఫ్ జిల్లా నాయకులు కొండయ్య,ఎంఎస్‌పి జిల్లా మహిళా అధ్యక్షురాలు జానకి, ఎంఆర్‌పిఎస్ జిల్లానాయకులు కె.ఉదయ్‌కుమార్, కోవూరు నియోజకవర్గం ఎంఎస్‌పి నాయకులు కొమరిక వెంకటరమణయ్య, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు గరిసిగుంట శ్రీనయ్య, ఎంఈఎఫ్ మండల నాయకులు దర్శిగుంట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మా శ్రీనివాసులు పురుగులమందు సేవించి మృతి

**కావలి, ఫిబ్రవరి20 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం మద్దూరుపాడు గ్రామంలో నివసిస్తున్న కొమ్మా శ్రీనివాసులు(41) ఇంట్లో ఎవరూలేని సమయంలో మనస్తాపానికిగురై పురుగులమందు సేవించి మృతిచెందినట్లు కావలి రూరల్ ఎస్ఐ కె.బాలకృష్ణయ్య తెలిపారు. మృతుడు కావలి రైతుబజార్‌లో కూరగాయలషాపు నడుపుతున్నట్లు, ఆయన యాక్సిడెంట్‌కు గురై వైద్యానికి 20లక్షలు ఖర్చుపెట్టినట్లు అప్పటినుంచి మానసికస్థితి సరిగాలేనట్లు తెలిపారు. ఇటీవల మృతుడు వ్యాపారంకోసం 20వేలు అప్పుచేసినట్లు, ఇచ్చినవ్యక్తులు అప్పుచెల్లించమని అడగడంతో మనస్తాపానికి గురై పురుగుమందు సేవించడంతో చికిత్సకోసం కావలి ఏరియావైద్యశాలకు తరలించారని తెలిపారు. మెరుగైన వైద్యంకోసం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పర్వత రెడ్డితో 54వ డివిజన్ నాయకులు



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** నగర ఇంచార్జిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుండి వైఎస్ఆర్సిపి నాయకులకు కార్యకర్తలకు నేనున్నానంటూ భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని కలిసేందుకు గురువారం నెల్లూరు రాంజీ నగర్‌లోని వైఎస్ఆర్సిపి నగర కార్యాలయానికి 54వ డివిజన్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 57వ డివిజన్ వైసిపి నాయకులు అస్లాం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువత పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి డివిజన్లో ఉండే సమస్యలపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి ప్రజల్లో అపూర్వ స్పందన ఉందని పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి పిలుపునిచ్చారు. కార్యకర్తలకు నాయకులకు నేనున్నానంటూ మరోసారి ఇచ్చారు. రాబోయే రోజుల్లో డివిజన్ నాయకులతో భేటీ పార్టీ చేపట్టబోయే కార్యక్రమాల్లోనూ ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సలీం, మున్నాభాయ్, భాష, తదితరులు పాల్గొన్నారు.

## మీ వెంటే మేముంటాం - కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** నియోజకవర్గంలో గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కార్యక్రమంలో అపూర్వ స్పందన వస్తుంది. నియోజకవర్గం పరిధిలోని కాకుపల్లి గ్రామంలో 38వ రోజు ప్రారంభమైన గడపగడపకు కార్యక్రమంలో మహిళలు పూలతో స్వాగతం పలికారు. గ్రామంలో గడపగడపకు తిరుగుతూ నా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మీ వెంటేమేముంటాం అంటూ ప్రజలకు భరోసాని స్తున్నారు. ఈ సందర్భంగా ఈ సందర్భం గా గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆయన స్థానిక సమస్యలపై అడిగి తెలుసుకుంటున్నారు. మూడుసార్లు తన అన్నను గెలిపించిన రూరల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన స్ఫూర్తితోనే గడపగడపకు వచ్చి మీ సమస్యలు తెలుసుకుంటున్నానని ఆయన వివరిస్తున్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. రూరల్ నియోజకవర్గంలో రాజకీయ కక్షలకు తావు లేకుండా అభివృద్ధి లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పని చేద్దామని స్థానిక ప్రజలకు పిలుపునిచ్చారు.

## డిఎస్పి సింధు ప్రియను అభినందించిన మైండ్స్ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ మొగిలి వంశీకృష్ణ



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** మైండ్స్ ఐఏఎస్ అకాడమిలో కోచింగ్ తీసుకొన్న సింధు ప్రియ నెల్లూరు అర్బన్ అర్బన్ డిఎస్పిగా నియమితులవడం సంతోషంగా వుందన్నా అకాడమి డైరెక్టర్ మొగిలి వంశీకృష్ణ. నెల్లూరు అర్బన్ అర్బన్ డిఎస్పిగా బాధ్యతలు స్వీకరించిన సింధుప్రియను ఆమె కార్యాలయంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మైండ్స్ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ మొగిలి వంశీకృష్ణ మాట్లాడు తూ మైండ్స్ విద్యా సంస్థలో గ్రూప్ 1 కోచింగ్ తీసుకున్న ఎందరో విద్యావంతులు రెవెన్యూ, పోలీస్ తదితర ప్రజా సంబంధ శాఖలలో ఉన్నతాధికారులుగా రాణి స్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాలలో తమ విద్యార్థులు జిల్లా రిజిస్ట్రార్లు, ఎంపిడిఓలు, తహశీల్దార్లుగా ఉన్నత హోదాలో పాలనా దక్షత కలిగిన ప్రభుత్వ అధికారులుగా రాణించడం తమ సంస్థకు గర్వకారణంగా వుందన్నారు. గ్రూప్ 1 ప్రిపరేషన్ సమయంలో మైండ్స్ అకాడమీ వారి స్ట్రాట జీ పోటీ పరీక్షలలో ఎంతో ఉపయోగపడిందని ఈ సందర్భంగా నెల్లూరు అర్బన్ డిఎస్పి సింధు ప్రియ తెలిపారు. ఒత్తిడిని జయిస్తే అధిగమిస్తే విజయానికి మార్గం సుగమం అవుతుందన్నారు.

## జీజీహెచ్‌నీ పరిశీలించిన కిషోర్



**నెల్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త – వైద్యం :** నగరం లోని దుర్గామెట్టిలో ఉన్న సర్వ జన ప్రభుత్వ పెద్దాసుపత్రిని జనసేన పార్టీ జిల్లా కార్య దర్శి గునుకుల కిషోర్ గురువారం పరిశీలించారు. అక్కడరోగుల కు అందుతున్న వైద్య సేవలపై పలువురిని అడిగి తెలుసుకున్నా రు.జనసేన పార్టీ తరుపున పేద లకు సేవ చేసే విషయంలో వైద్య సేవలకు గవర్నమెంట్ హాస్పిటల్‌లో తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న పెద్దాసుపత్రి కమిటీ సభ్యులు శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మల్లిలని సందర్భంగా కిషోర్ కలిశాడు. అనేక సందర్భాల్లో పేదలకు చికిత్స విషయంలో వారు చేసిన అందించిన సేవలను గుర్తు చేసుకుని ప్రజారాజ్యం పార్టీ అప్పటి నుంచి వారు సేవలను కొనసాగిస్తున్నందుకు వారికి ఆయన అభినందనలు తెలియజేశాడు.

## బ్యాంకు రుణాలు పొందండి



**నెల్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త–వైద్యం :** సోలార్ విద్యుత్ కోసం బ్యాంకు ద్వారా రుణాలు పొందవచ్చని విద్యుత్ శాఖ నెల్లూరు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్ తెలిపారు. గురువారం నగరంలోని విద్యుత్ భవన్‌లో విజయన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తి బిజిలీ యోజన పథకంలో వినియోగదారులు విద్యుత్ శాఖకు చెల్లించాల్సింది ఒక్క మీటర్‌కు మాత్రమే అని తెలిపారు. సింగల్ ఫేస్ మీటర్(4 కిలో వాట్స్ వరకు) కు అయితే రూ.3600, త్రీ ఫేస్ మీటర్‌కు (14 కిలో వాట్స్ వరకు) అయితే రూ.5,605, సిటి మీటర్ కు (15 కిలో వాట్స్ నుండి 37.5 కిలో వాట్స్ వరకు) అయితే రూ.8,306, మాత్రమే చెల్లించాలని తెలిపారు. ఈ మీటర్ ఖర్చులు మాత్రమే విద్యుత్ సంస్థ మీరు చెల్లించాల్సిందని తెలిపారు. వినియోగదారుడు సోలార్ విద్యుత్ కొరకు వెబ్ సైట్‌లో నమోదు చేసుకున్న తరువాత వెండర్ సెలక్షన్ ఉంటుంది. ఎంత మంది వెంబర్స్ ఉన్నారో వారి అందరి లిస్టు వెబ్ సైట్‌లో ఉంటుంది. వెంబర్ సెలక్షన్ అయిన తరువాత వెండర్ మీకు సోలార్ పలకలు, సామాగ్రి ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ మొత్తం పక్రియలో విద్యుత్ సంస్థకు ఎటువంటి సంబంధం ఉండదు. మా సంస్థ అధికారులు కాని సిబ్బంది కాని ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని ఎటువంటి సంబంధం ఉండదు. మొత్తం పక్రియ వెంబర్, వినియోగదారునికి మాత్రమే సంబంధించినదని తెలిపారు. ఈ పక్రియ అయిన తరువాత డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ లాగిన్‌కు వెలుతుందన్నారు. డిప్యూటీ ఇంజనీర్ స్వయంగా వచ్చి ఇన్స్పెక్షన్ చేస్తారని తెలియజేశారు. ఈ ఇన్స్పెక్షన్ టైంలో వినియోగదారుడు ఇండియాలో తయారైన ప్యానెల్స్ వాడుతున్నారా లేదా లైటనింగ్ ఎరస్టర్ ఏర్పాటు చేసుకున్నారా లేదా అని , 3 ఎర్త్ పైపులు బిగించారా లేదా అని తనిఖీ చేసి రిపోర్ట్ ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. వినియోగదారునికి మీటర్ బిగించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ మీటర్ కు అయ్యే ఖర్చు మాత్రమే వినియోగదారుడు విద్యుత్ సంస్థకు చెల్లించాల్సి ఉంటుందని ఆయన అన్నాడు. వినియోగదారుడు వెంబర్ డబ్బులు చెల్లించిన తరువాత మీటర్‌కు మాత్రమే డబ్బులు చెల్లించాలి. మిగతా ఎక్కడ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. తర్వాత వెంటనే సబ్సిడీకి అప్లై చేసుకోవచ్చు. సబ్సిడీ ఏడు రోజుల నుంచి 15 రోజుల లోపల మీట బ్యాంకు అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## మాజీ ఎంపిటిసి కుటుంబ సభ్యులను ఓదార్చిన మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



**ఆత్మకూరు, ఫిబ్రవరి20, ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలం కరటంపాడు ఎంపిటిసి సభ్యులు ఖాసింసా ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం దివంగత ఎంపిటిసి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. ఖాసింసా మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. దివంగత వాలంటీర్ రసూల్ కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న మాజీ వైస్ సర్పంచ్ ని పరామర్శించారు. ఆయన వెంట జిల్లా ఆర్‌టిఏ మాజీ సభ్యులు అంబటి కృష్ణారెడ్డి, ఆత్మకూరు రూరల్ వైసిపి కన్వీనర్ చిట్టమూరు జితేంద్ర నాథ్‌రెడ్డి, జిల్లా డాక్టర్స్ విభాగం వైఎస్ఆర్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్‌ప్రణీత్, జిల్లా వైసిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ వల్లభనేని రాజేంద్రనాయుడు, ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్‌సొసైటీ మాజీ చైర్మెన్, ఆత్మకూరు వైసిపి పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, ఆత్మకూరు మండల రూరల్ వైసిపి నాయకులు డి.రమేష్‌నాయుడు, ఆరవీడుజంగాలపల్లి నాయకులు నాగేశ్వరరావ్, సర్పంచ్ సూరం ప్రసాద్‌రెడ్డి, గండ్లవీడు వైసిపి నాయకులు గాడి శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మొదటి ప్రాధాన్యత ఓటు ఆలపాటికే వేయాలి



కోవూరు, ఫిబ్రవరి 20ప్రభాతవార్త :రానున్న శాసనమండలి ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని ఏపీఈఎన్ సీఏల్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి కోరారు. చిలకలూరిపేటలోని బాష్యం, సాయి వికాస్, నారాయణలలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రను గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. మాజీ మంత్రి , ఎమ్మెల్యే పుల్లారావు, బీజేపీ కన్వీనర్ జయరామ్, జనసేన కన్వీ నర్ రాజా రమేష్, కోఆర్డినేటర్ సదాశి వరావు, కరిముల్లా, తదితరులు ఉన్నారు.




## స్వర్ణాంధ్ర -2047తో పేదరికం నిర్మూలన



**సైదాపురం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదరికాన్ని నిర్మూలించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర– 2047ను రూపొందించడం జరిగిందని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 సర్వేను మండలంలో ఉన్న సచివాలయం పరిధిలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గిద్దలూరు సచివాలయాన్ని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ సందర్శించి క్షేత్ర స్థాయిలో జరిగే సర్వే విధానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర– 2047లో భాగంగా ప్రతి గ్రామంలో అట్టడుగున ఉన్న నిరుపేదలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. కనీస అవసరాలకు సైతం నోచుకోని వారికి అధిక ప్రాధాన్యత ఉంటుందని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఈ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సర్వే మార్చి 2వ తేదీ వరకు జరుగుతుందని, గ్రామాల్లోని ప్రజలు పీ4 సర్వే చేసే సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. ఆయనతో పాటు ఏవో మురళికృష్ణ, ఈవోపీఆర్డీ రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, ఫిబ్రవరి 20ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసి ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పడుగుపాడు సహకార పరపతి సంఘంలో నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాటూరు , చెర్లోపాలెం, వేగూరు, పోతిరెడ్డిపాలెం గ్రామాల్లో మల్టిబుల్ పర్పస్ గోదాములు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని రైతులు పూర్తిస్తాయిలో ఉపయోగించుకోవాలన్నారు. ప్రస్తుతం వరి పంట కోతకు వచ్చిన నేపథ్యంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, దళారి వ్యవస్థను రూపుమాపి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర కల్పించడమే ఈ కొనుగోలు కేంద్రం ఏర్పాటు లక్ష్యమన్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం కల్పించిన రాయితీలను రైతన్నల వద్దకు చేర్చే ఈ పడుగుపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం ప్రారంభోత్సవంలో పాల్గొనడం సంతోషంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో జిల్లా సెంట్రల్ బ్యాంక్ సీఈవో శ్రీనివాసులు, జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కాటంరెడ్డి కృష్ణారెడ్డి, కోవూరు నీటి సంఘం అధ్యక్షుడు అత్తిపల్లి శివారెడ్డి, సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి, పర్సన్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, ఎంపీపీ టి. పార్వతి, వేగూరు సర్పంచ్ అమరావతి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, పార్టీ నేతలు బాల రవి, ఎం. సుధాకర్, ఎన్. వెంకట్, శ్యామ్ సుందర్‌రెడ్డి, జెట్టి మదన్‌రెడ్డి, సుబ్బారావు, శ్రీనివాసులురెడ్డి, వంశీకృష్ణ, వెంకటేశ్వర్లు, వెంకటరమణమ్మ, తిరుమూరు అశోక్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, తహసీల్దార్ నిర్మలానందబాబా, మండల వ్యవసాయాధికారిణిఇందిరావతి, ఏపీఎం సుబ్బరాజు, కోవూరు సీఏ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్ గౌడ్, మహిళా రైతులు ఉన్నారు. ఈ సందర్భంగా సహకార సొసైటీలోని లాకర్‌ను పరిశీలించి ఇప్పటికే బంగారు ఆభరణాల రుణాలపై అధిక మొత్తంలో రైతులకు రుణాలు ఇవ్వడం పట్ల సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. అంతకుముందు శాంతినగర్ నుంచి సొసైటీ వరకు మేళతాళాలు, మంగవాయిద్యాలు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేనుస్వాగతించారు. సొసైటీ సిబ్బంది రైతులు ఉన్నారు.

## రైతు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కనిపించలా చర్యలు



**నెల్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త – కలెక్టరేట్ :** గురువారం కలెక్టర్ కార్యాలయంలోని శంకరం హాల్లో ప్యాడి పై సమీక్ష సమావేశం జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ లీగల్ మెట్రాలజీ మార్కెటింగ్, సివిల్ సప్లై అధికారులతో సమావేశం నిర్వహించారు. పీపీసీల ఏర్పాట్లు రైతు తాము పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కల్పించి చర్యలు తీసుకోవాలని, ధాన్య కొనుగోలు దళారులతో మరియు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లతో మిల్లర్లతో సమావేశం నిర్వహించి ఎటువంటి పరిస్థితిలో కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ కాకుండా రైతులు దగ్గర ధాన్యం కొనుగోలు చేయాలని, బీ జి ఇచ్చి అదే విధంగా గోనెసంచులను సేకరిస్తున్నారు. అదే విధంగా గోనెసంచులను పిపీసీ నందు సమకూర్చాలని కోరడం జరిగింది. దానికి రైస్ మిల్లర్స్ అందరూ, గోనెసంచులను ఇస్తామని చెప్పడం జరిగింది. అదేవిధంగా అధికారులకు రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పీపీసీలను రెడీగా ఉంచాలని ఆదేశించారు.

## ట్రాఫిక్‌కి అంతరాయం లేకుండా దుకాణాలు పెట్టుకోండి



**బుచ్చి ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం చెన్నూరురోడ్డులో ముంబాయి రహదారిలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ,వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్,కౌన్సిలర్లు బెళ్ళం మల్లారెడ్డి, రహమత్, రాచూరుసత్యంతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతు కోవూ రు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాం తిరెడ్డి సూచనల మేరకు చెన్నూరురోడ్డులో,ముంబాయి రహదారిలో ట్రాఫిక్ పరిశీలించడం జరిగిందని ఆమె చెప్పారు.చెన్నూరురోడ్డులో ప్రధానం ఆటోల సమస్య ఎక్కువగా ఉందని,అలాగే ముంబాయి రహదారిలో ఆటోలు,బస్సులు సమస్య ఎక్కువగా ఉందని ఆమె తెలిపారు.ఈ రెండు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్ళి పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. అనంతరం ఆమె మార్కెట్ నిర్మాణాన్ని పరిశీలించారు. మార్కెట్ నిర్మాణం వేగవంతంగా జరుగుతుందని అప్పటి వరకు మార్కెట్‌లో ఉండే వారికి ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆమె వెంట మున్సిఫల్ సిబ్బంది ఉన్నారు.

## అగ్రహారంలో మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రత్యేక పూజలు



**అనంతసాగరం,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనస భ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి మండల ంలోని బొమ్మవరం అగ్రహారంలో నూత నంగా నిర్మించిన శ్రీ సీతారా మస్వా మి, శ్రీఅభయా ంజనేయస్వామి ఆలయ ంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. ఈసందర్భంగా మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి ,నాయకులు అక్కలరెడ్డి అంకిరెడ్డి వైసిపి నాయకులు ఘనంగా ఆహ్వానించి శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంపిపి పెయ్యల సంపూర్ణ, సర్పంచ్ లక్ష్మీదేవి, శోభ, నాయకులు పాల్గొన్నారు.

## నూతన కమీషనర్‌ని కలిసిన చేనేత డైరక్టర్ తాళ్ళస్వామి



బుచ్చి ఫిబ్రవరి 20 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ నూతన కమీషనర్‌గా వచ్చిన డి.బాలకృష్ణను రాష్ట్ర చేనేత డైరక్టర్ తాళ్ళ నరసింహస్వామి,కౌన్సిలర్ వైష్ణవి మర్యాదపూర్వకంగా కలిశారు. కమీషనర్‌కి శాలువా కప్పి గౌరవించారు. బుచ్చిరెడ్డిపాళెం నగరాభివృద్ధికి సహకారం అందించాలని ఆయన్ని కోరారు.

## కావలి ఎంపిడిఓ కార్యాలయంలో జెడ్‌పిసిఈఓ విద్యారమ ఆకస్మిక తనిఖీ



**కావలిరూరల్, ఫిబ్రవరి20 ప్రభాతవార్త** కావలి మండలపరిషత్ కార్యాలయంలో జెడ్‌పిసిఈఓ ఎం.విద్యారమ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఎంపిడిఓ కార్యాలయంలో మండలంలోని అధికారులు, ఎంపిడిఓ సిహెచ్.శ్రీదేవి, ఎఓ సంధ్యారాణి, ఎంఈఓ బండి గోవిందయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ సతీష్, పిఆర్ఎఈ సుబ్రహ్మణ్యం, ఈఓపిఆర్‌డి అబ్దుల్ సమద్, పంచాయితి కార్యదర్శులతో సమీక్షసమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమీక్షాసమావేశంలో పంచాయితి నిధులు, మండలపరిషత్‌తో చేస్తున్న అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకోవడం జరిగింది. గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా ఎం.విద్యారమ మాట్లాడారు. పంచాయితిరాజ్‌శాఖ కమీషనర్ ఆదేశాలమేరకు అన్ని మండలాలను సందర్శిచి సమీక్ష సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలియచేశారు. ఈ సమావేశాల్లో సమస్యలు తెలుసుకుని గ్రామలప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా సమస్యల పరిష్కారానికి కృషిచేయడం జరుగుతుందని తెలియచేశారు. జిల్లాలోని కావలి, నెల్లూరు, ఆత్మకూరు, కందుకూరు డివిజన్‌లలో డిఎల్‌డిఓ కార్యాలయాలకు స్థలసేకరణ చేస్తున్నట్లు తెలియచేశారు.

## జెసిని కలిసిన జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి



**నెల్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త – కలెక్టరేట్** గురు వారం జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి జి. హరి కృష్ణ జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ ని కలిసారు. అనంతరం త మ శాఖకు సంబంధించిన క్యాలెండర్‌ను జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి . హరికృష్ణ జేసికి అందజేశారు.

## సిసోడియాకు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు. ఫిబ్రవరి 20, ప్రభాతవార్త – కలెక్టరేట్** నెల్లూరు చేరుకున్న రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ రాం ప్రసాద్ సిసోడియా కు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, కావలి,ఆత్మకూరు ఆర్‌డిఓలు నేడు రెవిన్యూ అధికారులతో సిసోడియా సమావేశమవుతారు.

## పొరపాట్లకు తావులేకుండా రీ సర్వే పక్రియను చేయాలి జిల్లా కలెక్టర్



**ఇందుకూరుపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త** ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రీ సర్వే పక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మండలంలోని ముదివర్తిపాలెం గ్రామంలో జిల్లా కలెక్టరన ఆనంద్ గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన రీ సర్వే పక్రియను అధికారులతో సమీక్షించి రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రాజెక్టు కింద ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఫైలెట్ ప్రాజెక్టు కింద రీ సర్వే పక్రియ జరుగుతుందన్నారు. రీ సర్వేకి సంబంధించిన ఎస్ఓపీ(ప్రాజెక్టు ఆపరేషన్ ప్రోసీజర్0ను వీఆర్వోలు సర్వేయర్లు క్షుణ్ణంగా అవగాహన చేసుకుని రీ సర్వే చేస్తే పొరపాట్లకు ఆస్కారం ఉండదని కలెక్టర్ పేర్కొన్నారు. రీ సర్వేలో ముందుగా బౌండరీలు నిర్ణయించి ఆ తరువాత రైతుల అభిప్రాయాలు గ్రామ సభలు ద్వారా భూ కొలతలు నిర్ణయిస్తామన్నారు. సాధ్యమైనంత వరకు రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రీ సర్వే పక్రియ జరుగుతుందన్నారు. కోర్టు వివాదాలు కుటుంబ తగాదాలు తప్ప మిగిలినవి పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ ఏడీ నాగశేఖర్, డీఏఓ సత్యనారాయణరెడ్డి, మండల తహశీల్దార్ కృష్ణ ప్రసాద్, ఆర్ఎస్‌డీటీ శివ ప్రసాద్, సికాగొల్లు నాగరాజు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.